

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

జిల్లాలో బతుకమ్మ సంబురాలు కొనసాగుతున్నాయి. మహిళలు ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు.

- 9లో ▸



రైతులను రోడ్లపైకి తెచ్చారు..

హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను రోడ్ల మీదకు తెచ్చిందని మాజీ ఎమ్మెల్యే సురేందర్ అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

40.1 /23.3

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

పండుగ షాపింగ్‌కు పట్నం బాట!

బతుకమ్మ, దసరా పండుగలు వచ్చాయంటే చిన్నా పెద్ద తేడా లేకుండా దుస్తులు కొంటారు. దీంతో వస్త్ర దుకాణాల యజమానులు కూడా ఆఫర్లతో ప్రజలను ఆకర్షిస్తారు. అయితే ఒకప్పుడు గ్రామీణ ప్రాంత మహిళలు తమ దగ్గరలోని దుకాణాల్లోనే దుస్తులు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో కామారెడ్డి, నిజామాబాద్, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లి పెద్ద పెద్ద మాల్స్‌లో షాపింగ్ చేస్తున్నారు.

- మహిళలకు కలిసొచ్చిన మహాలక్ష్మి పథకం
- వస్త్రాల కొనుగోలుకు కామారెడ్డితో పాటు ఇతర పట్టణాలకు వెళ్తున్న వైనం
- మండల కేంద్రాలు, గ్రామాల్లో బిజినెస్‌కు దెబ్బ



కామారెడ్డి బస్టాండ్‌లో మహిళల రద్దీ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా కొత్త బట్టలు తొడగడం ఆనవాయితీగా వస్తోంది. కొందరైతే పండుగల సమయంలోనే కొత్త బట్టలు కొనుగోలు చేస్తుంటారు. పండుగ పూట కొత్త బట్టలు తొడుక్కోవాలన్న సెంటిమెంటు అలాంటిది. పేదలు సైతం పండుగ నాడు కొత్తవి కొనుగోలు చేయడానికి ఇష్టపడతారు. ముఖ్యంగా మహిళలు బతుకమ్మ పండుగకు కొత్త చీరలు ధరించి ఎంతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొంటారు. మగవాళ్లు దసరా రోజు కొత్త బట్టలు ధరించి పాలపిట్ట దర్శనం చేసుకుని ఆత్మీయులతో ఆనందం పంచుకుంటారు. కొన్ని కుటుంబాల్లో అయితే బతుకమ్మ, దసరా ఎప్పుడు వస్తాయోనని ఎదురు చూస్తుంటారు. అయితే ఉన్నత వర్గాల వాళ్లు నగరాల్లోని మాల్స్‌కు వెళ్లి షాపింగ్ చేస్తుండగా, మధ్యతరగతి వాళ్లు సమీపంలోని పట్టణాల్లో బట్టలు కొనుగోలు చేస్తుంటారు. పేద, దిగువ మధ్య తరగతి ప్రజలు ఊళ్లల్లో, సమీపంలోని పెద్ద గ్రామాల్లో, మండల కేంద్రం లేదంటే చిన్నపట్టణాల్లో తమ స్థాయిలో బట్టలు కొనుగోలు చేయడం సహజం. ఇటీవలి కాలంలో బట్టల కొనుగోళ్ల విషయంలో మార్పు కనబడుతోంది.

ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించడానికి తీసుకువచ్చిన 'మహాలక్ష్మి' పథకంతో పేద, దిగువ మధ్య తరగతి మహిళలు కూడా పట్టణాల బాట పడుతున్నారు. రానుపోను ఎలాంటి ఖర్చు లేకపోడంతో బస్సెక్కుతున్నారు. గతంలో అందుబాటులో ఉన్న దుకాణాల్లో కొనుగోలు చేసిన వారంతా ఇప్పుడు బస్సెక్కి పట్టణాలకు వెళ్లి మరీ బట్టలు, ఇతర సామాన్లు కొనుగోలు చేస్తున్నారు. దీంతో పల్లెలు, చిన్న చిన్న పట్టణాలు, మండల కేంద్రాల్లో వ్యాపారాలు గిరాకీ లేక వెలవెలబోయే పరిస్థితి ఏర్పడింది.





కామారెడ్డిలోని ఓ వస్త్ర దుకాణం వద్ద మహిళల సందడి

హైదరాబాద్‌కూ పయనం..

మహాలక్ష్మి పథకంలో భాగంగా పల్లె వెలుగుతో పాటు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ రాష్ట్రమంతటా ఉచితంగా ప్రయాణించే అవకాశం లభించడంతో మహిళలు చాలా మంది పండుగ షాపింగ్ కోసం నగరాలకూ వెళుతున్నారు. ముఖ్యంగా కామారెడ్డి ప్రాంతం నుంచి ప్రతీ నిత్యం హైదరాబాద్‌కు వందలాది మంది వెళుతున్నారు. కోంపల్లి, సుచిత్ర సర్కిల్ ప్రాంతాల్లో అన్ని షాపింగ్ మాల్స్ ఏర్పాటు కావడంతో చాలా మంది ఇక్కడ బస్సెక్కి షాపుల ముందే దిగుతున్నారు. షాపింగ్ అయిపోయిన తర్వాత తిరిగి అక్కడే బస్సు ఎక్కి రిటర్న్ వస్తున్నారు. భిక్కనూరు, దోమకొండ, కామారెడ్డి మండలాల నుంచి ఎక్కువ సంఖ్యలో వెలుతున్నారు. ఇంతకుముందు హైదరాబాద్‌లో కొంత ఆర్థికంగా ఉన్న వారే కార్లలో వెళ్లి షాపింగ్ చేసుకుని వచ్చేది. ఇప్పుడు మాత్రం మహాలక్ష్మి పథకం పుణ్యమా అని మధ్య తరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలు కూడా వెళ్లి షాపింగ్ చేస్తుండడం విశేషం.

జిల్లా కేంద్రంలో పెరిగిన రద్దీ..

గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో జనం జిల్లా కేంద్రానికి తరలివస్తున్నారు. దీంతో పట్టణంలో రద్దీ పెరిగింది. వ్యాపార కూడళ్లు, షాపింగ్ మాల్స్‌లో విపరీతమైన రద్దీ కనబడుతోంది. పండుగకు ఇంకా సమయం ఉన్నా అప్పుడే కొనుగోళ్లు ముమ్మరం అయ్యాయి. భిక్కనూరు, మాచారెడ్డి, దోమకొండ, బీబీపేట, లింగంపేట, గాంధారి తదితర మండలాల నుంచి చాలా మంది జనం కామారెడ్డి పట్టణానికి వచ్చి బట్టలు కొనుగోలు చేస్తున్నారు. బీర్కూర్, నస్రుల్లాబాద్, బాన్సువాడ, మద్నూర్, బిచ్కుంద తదితర మండలాలకు చెందిన వారు గతంలో ఎక్కువగా బాన్సువాడ పట్టణంలోనే కొనుగోలు చేసేవారు. ఇప్పుడు చాలా మంది నిజామాబాద్‌కు వెళ్తున్నారు. లింగంపేట, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి తదితర మండలాల్లోని గ్రామాలకు చెందిన మహిళలు కొంత మంది మెదక్‌కు, కొందరు కామారెడ్డికి వెళుతున్నారు. ఆయా మండల కేంద్రాల్లో వ్యాపారాలు నడుస్తున్నా, గతంలోలాగే గిరాకీ రావడం లేదని వ్యాపారులు అంటున్నారు. కామారెడ్డిలోని పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ వారు ఆఫర్లు పెట్టడంతో జనమంతా ఊళ్ల నుంచి వచ్చి ఆయా మాల్స్ వద్ద వరుస కడుతున్నారు.

న్యూస్‌రీల్

ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు



బాన్సువాడ : అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. గురువారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్‌లోని తహసీల్దార్లు, సీఐలు, ఎస్సైలు, మైనింగ్, అటవీశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. డివిజన్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేయాలని, రాత్రి వేళల్లో మంజీర ప్రాంతంలో గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. రెవెన్యూ, ఫారెస్ట్ భూములకు సంబంధించి ఇరు శాఖల సమన్వయంతో సర్వే నిర్వహించాలన్నారు.

474 మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన



కామారెడ్డి టౌన్ : డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ పరిశీలన రెండో రోజు డీఈవో కార్యాలయంలో కొనసాగింది. మొదటి రోజు 133 మంది ధ్రువపత్రాలను పరిశీలించగా గురువారం 474 అభ్యర్థులు వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. ఇంకా 609 మంది సర్టిఫికెట్‌లను సమర్పించాల్సి ఉందని డీఈవో రాజు తెలిపారు. 10 ప్రత్యేక కౌంటర్ల ద్వారా విద్యాశాఖ అధికారులు సర్టిఫికెట్ల పరిశీలన చేస్తున్నారు.

పరిశీలించిన కలెక్టర్

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ తీరును గురువారం ఆయన పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఈవో రాజు, తదితరులు ఉన్నారు.

నేడు పీసీసీ అధ్యక్షుడి రాక



కామారెడ్డి టౌన్ : పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ శుక్రవారం జిల్లాకు రానున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు తెలిపారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. భిక్కనూర్ వద్ద పీసీసీ అధ్యక్షుడికి ఘన స్వాగతం పలుకుతామని చెప్పారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. గోనే శ్రీనివాస్, గంగాధర్, బట్టు మోహన్ తదితరులున్నారు.

నెల రోజుల్లో 152 సెల్‌ఫోన్ల రికవరీ



కామారెడ్డి క్రైం : సెల్‌ఫోన్‌ల రికవరీ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయని ఎస్పీ సింధుశర్మ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం మొబైల్ ఫోన్‌ల రికవరీ మేళా ఏర్పాటు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. నెల రోజుల క్రితం జిల్లాలో సెల్‌ఫోన్‌ల రికవరీ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. సీఈఐఆర్ టెక్నాలజీని ఉపయోగించి నెల రోజుల వ్యవధిలో ఈ బృందం సభ్యులు 152 ఫోన్‌లను రికవరీ చేశారని తెలిపారు. మొబైల్ చోరీకి గురైనా, పోగొట్టుకున్నా సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫోన్‌ల రికవరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బంది రాజు, శ్రీనివాస్, ఇర్ఫాన్, వినోద్, రాజ్ కుమార్‌లను ఎస్పీ అభినందించారు. అనంతరం ఫోన్‌లను బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ నరసింహారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్‌కు కొనసాగుతున్న వరద

నిజాంసాగర్ : సంగారెడ్డి, మెదక్ జిల్లాలో కురుస్తున్న వర్షాలతో గురువారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వస్తోంది. జలాశయంలోకి 24 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా మూడు గేట్లు ఎత్తి అంతే మొత్తం దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా అంతే నీటి మట్టంతో నిండుకుండలా ఉంది.

డిజిటల్ కార్డుల కోసం ఇంటింటి సర్వే

- జిల్లాలో ఐదు గ్రామాలు, మూడు వార్డుల్లో చేపట్టిన అధికారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కుటుంబ సభ్యులందరి వివరాలతో డిజిటల్ కార్డులు రూపొందించేందుకు జిల్లాలోని ఐదు గ్రామాలు, మూడు మున్సిపాలిటీల్లోని మూడు వార్డుల్లో ప్రయోగాత్మక సర్వే గురువారం ప్రారంభమైంది. సంక్షేమ పథకాల అమలు కోసం ప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ కార్డు జారీ చేయనుంది. మాచారెడ్డి మండలంలోని రాజఖాన్‌పేట, నాగిరెడ్డిపేట మండలంలోని అచ్చాయిపల్లి, బాన్సువాడ మండలంలోని నాగారం, పిట్లం మండలం సిద్దాపూర్, జుక్కల్ మండలం లొంగన్ గ్రామాలతో పాటు కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీల పరిధిలోని ఒక్కో వార్డులో సర్వే నిర్వహించారు. కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను నమోదు చేస్తున్నారు. కుటుంబ సభ్యుల పేర్లు, ఆధార్ నంబరు, ఇంటి యజమాని పేరు, వారికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో చేపట్టిన సర్వేను కలెక్టర్, అదనపు కలెక్టర్, సబ్ కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులు పరిశీలించారు. ఈ నెల 8లోపు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.



కామారెడ్డిలో సర్వే తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

పక్కాగా నిర్వహించాలి

కామారెడ్డి క్రైం : ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ కోసం సర్వేను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో జరుగుతున్న సర్వే తీరును ఆయన తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద చేపడుతున్న సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, కమిషనర్ సుజాత పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయండి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ సింధుశర్మ, అధికారులు

కామారెడ్డి క్రైం : వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్ల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయా జిల్లాల కలెక్టర్‌లకు సూచించారు. గురువారం కలెక్టర్‌లతో ధాన్యం కొనుగోళ్లపై సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో మాదిరిగా కాకుండా ఈ సీజన్ నుంచి సన్న రకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లకు వేర్వేరు కౌంటర్లు, కాంటాలను ఏర్పాటు చేయాలన్నారు. సన్న రకం ధాన్యం బస్తాలపై తప్పనిసరిగా సీరియల్ నంబర్ ఉండాలని ఆదేశించారు. వర్షాలతో ధాన్యం తడిచి పోకుండా టార్పాలిన్ కవర్లు సిద్ధం చేయాలని సూచించారు. సన్న రకం ధాన్యం గుర్తింపు పక్కాగా జరిగేలా చూడాలన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. రెండు రోజుల్లోగా డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేయాలన్నారు.

క్వింటాల్‌కు రూ.500 బోనస్

సన్న రకం ధాన్యం సాగు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రజలకు అందించే రేషన్ బియ్యం అక్రమ రవాణా, దుర్వినియోగాలను అరికట్టేందుకు జనవరి నుంచి సన్నబియ్యం సరఫరా చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోగా రైతులకు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

356 కేంద్రాల ఏర్పాటు

జిల్లాలో 356 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. సీఎం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయన జిల్లా అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అవసరమైన చోట కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలని అధికారులకు సూచించారు. జిల్లా అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలన్నారు. ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు పరిష్కరించడానికి టోల్ ఫ్రీ నంబర్ 08468 -220051 ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సింధు శర్మ, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డీఆర్‌డీవో సురేందర్, సివిల్ సప్లయ్ డీఎం మేనేజర్ రాజేందర్, డీఏవో తిరుమల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి బల్దియా చైర్మన్‌గా శ్రీకాంత్

- మద్దతు తెలిపిన మాజీ చైర్మన్ సత్యనారాయణ
- హస్తగతమైన ఎల్లారెడ్డి మున్సిపాలిటీ

ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డి రూరల్ : ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా పద్మ శ్రీకాంత్ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రిసైడింగ్ ఆఫీసర్, ఆర్డీవో మన్నె ప్రభాకర్ సమక్షంలో కౌన్సిలర్ల సమావేశం నిర్వహించారు. మొత్తం 12 మంది కౌన్సిలర్లు ఉండగా కాంగ్రెస్ కౌన్సిలర్లు 8 మంది, ఎక్స్ అఫీషియో సభ్యుడు, ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు హాజరయ్యారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు నలుగురు గైర్హాజరయ్యారు. సరిపడా కోరం ఉండడంతో ప్రిసైడింగ్ ఆఫీసర్ ఎన్నికను నిర్వహించారు. చైర్మన్‌గా శ్రీకాంత్ పేరును 12వ వార్డు కౌన్సిలర్ నీలకంఠం ప్రతిపాదించారు. ఇతరుల నుంచి ఎలాంటి అభ్యంతరాలు లేక పోవడంతో శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. శ్రీకాంత్‌ను ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, ప్రిసైడింగ్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు, కౌన్సిలర్లు అభినందించారు.

ఎల్లారెడ్డి అభివృద్ధికి కృషి

నూతన చైర్మన్ హయాంలో ఎల్లారెడ్డి మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతుందని, అందుకు తన వంతు సాయం చేస్తానని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. ప్రజల అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నో పథకాలను తీసుకు వస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో నాగిరెడ్డిపేట మండలంలోని అచ్చాయిపల్లి, ఎల్లారెడ్డి మున్సిపాలిటి పరిధిలోని 12వ వార్డులో డిజిటల్ కార్డులకు సంబంధించిన సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిబాబా, వినోద్‌గౌడ్, సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, నాయకులు వెంకట్రాంరెడ్డి, ఉషాగౌడ్, ఆరీఫ్, గఫార్, నునుగొండ శ్రీనివాస్, తిరుపతి, ఇంతియాజ్ పాల్గొన్నారు.



శ్రీకాంత్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



కాంగ్రెస్ కౌన్సిలర్లతో ఎమ్మెల్యే

ఎట్టకేలకు ఎన్నిక

ఎల్లారెడ్డి బల్దియాలో 2019లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ తొమ్మిది స్థానాల్లో గెలుపొందింది. దీంతో ఆ పార్టీకి చెందిన కుడుముల సత్యనారాయణ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి మదన్‌మోహన్‌రావు గెలుపొందారు. దీంతో చైర్మన్ సత్యనారాయణ ఏప్రిల్ 27న హస్తం కండువా కప్పుకున్నారు. ఆయన పార్టీ మారడంతో బల్దియాలోని 11 మంది కౌన్సిలర్లు ఏకమై సత్యనారాయణపై అప్పటి కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు అవిశ్వాస నోటీసులను అందించారు. మే 18న అవిశ్వాస పరీక్షను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. అవిశ్వాస పరీక్ష నిర్వహించి, ఫలితం ప్రకటించొద్దని న్యాయస్థానం ఆదేశించింది. దీంతో ఆర్డీవో మే 18న అవిశ్వాస పరీక్షను నిర్వహించగా సత్యనారాయణకు వ్యతిరేకంగా 11 మంది కౌన్సిలర్లు ఓటు వేశారు. కోర్టు ఆదేశాల మేరకు ఫలితాన్ని వెల్లడించలేదు. ఫలితం ప్రకటించాలని కౌన్సిలర్లు హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు గతంలో ఇచ్చిన స్టేను ఎత్తివేసింది. దీంతో ఆర్డీవో జూలై 10న అవిశ్వాస పరీక్షలో సత్యనారాయణ పదవి కోల్పోయారని ప్రకటించారు. చైర్మన్ పదవి బీఆర్ఎస్ వశమవుతుందని భావించిన కాంగ్రెస్ నాయకులు ఎన్నికలో జాప్యం చేశారు. ఐదుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీ బలం 8కి చేరింది. దీంతో ఎన్నిక నిర్వహించగా బల్దియా పీఠం హస్తగతమైంది.



కామారెడ్డిలో అమ్మవారి విగ్రహంతో ఊరేగింపు

కొలువుదీరిన అమ్మవారు

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండపాల్లో అమ్మవారు కొలువుదీరారు. ఊరేగింపుగా వెళ్లి మండపాల్లో దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

రేపు కిసాన్‌సంఘ్ రాష్ట్ర మహాసభలు

కామారెడ్డి అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ పార్టీలకు అతీతంగా శనివారం కామారెడ్డిలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో గురువారం ఆయనతో పాటు కొమిరెడ్డి అంజన్న, గైని నాగేశ్వరరావు, అంబీర్ ఆనంద్‌రావు మాట్లాడారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 20 వేల మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ వరంగల్ సభలో ప్రకటించిన రైతు డిక్లరేషన్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. కేంద్రం వ్యవసాయాన్ని లాభసాటి చేస్తానని ప్రకటించిన అమలు కావడం లేదన్నారు. సంగిశెట్టి రాజేశం, అర్ల శంకర్ రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిసాన్‌సంఘ్ నాయకులు

క్లుప్తంగా

రాజరాజేశ్వరి ఆలయంలో మహా చండీహోమం



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని వీక్లీమార్కెట్‌లో శ్రీ రాజరాజేశ్వరి దేవి ఆలయంలో గురువారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. పట్టణ మున్నూరు కాపు సంఘం, రాజరాజేశ్వరి గుడి సిండికేట్ ఆధ్వర్యంలో ఆలయంలో వేదపండితులతో మహా సప్తశతి చండీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రవి, రాజేష్, క్రాంతి, వంశీ, గౌతమ్, తదితరులు ఉన్నారు.

బోరు బావి తవ్వకం



కామారెడ్డి టౌన్ : మున్సిపల్ పరిధిలోని 40వ వార్డులో బోరు మోటార్ తవ్వకం పనులను గురువారం వార్డు కౌన్సిలర్ భాస్కర్‌గౌడ్ ప్రారంభించారు. శివాలయం కాలనీలో నీటిఎద్దడి తీర్చేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులతో బోరు వేయించడం జరిగిందన్నారు.

ఎంపీకి ఆహ్వానం



దోమకొండ : దోమకొండలోని చాముండేశ్వరి ఆలయంలో జరుగుతున్న దేవి నవరాత్రి ఉత్సవాలకు రావాలని కోరుతూ గురువారం ఎంపీ సురేష్‌షెట్కర్‌కు హైదరాబాద్‌లో ఆహ్వానపత్రిక అందజేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి తెలిపారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపల్లి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

సాయి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం



భిక్కనూరు : మండల కేంద్రంలోని హనుమాన్ మందిరం వద్ద శ్రీసాయి హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం అన్నదానం చేశారు. గజవాడ రాజేందర్–మంజుల దంపతులు తమ కుమారు సాయికుమార్ జన్మదినం సందర్భంగా నిరుపేదలకు అన్నదానం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదానం కొనసాగింది. నిరుపేదలకు ప్రతి గురువారం అన్నదానం నిర్వహిస్తున్నట్లు శ్రీసాయి హనుమాన్ సేవా సమితి ప్రతినిధులు తెలిపారు.

వన్యప్రాణి వారోత్సవాలు ప్రారంభం

- ఈ నెల 9వరకు నిర్వహించనున్న అటవీ శాఖ
- ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు



చిన్నాపూర్ అర్బన్ పార్క్‌లో వన్య ప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

డొంకేశ్వర్: జిల్లాలో 70వ వన్యప్రాణి వారోత్సవాల నిర్వహణకు అటవీ శాఖ సిద్ధమైంది. ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం అన్ని రేంజ్‌ల పరిధిలో కార్యక్రమాలను ప్రారంభించారు. వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు, విద్యార్థులకు అటవీ అధికారులు అవగాహన కలిప్తున్నారు. జిల్లాలో 86,871 హెక్టార్ల విస్తీర్ణంలో అడవులు ఉన్నాయి. అడవులతో పాటు మంజీరా, ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతం పచ్చికబయళ్లలో వన్య ప్రాణుల సంచారం ఎక్కువగా ఉంటుంది. అటవీ అధికారులు మొదటి రోజు ర్యాలీ నిర్వహించి స్థానిక ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. వన్య ప్రాణులు, అడవుల సంరక్షణకు ఏవిధంగా పాటుపడాలో వివరించారు. అలాగే జంతువులను వేటాడడం నేరమని, వాటిని వేటాడితే చట్టప్రకారం శిక్షలుంటాయని తెలిపారు. వన్యప్రాణులు అనుకోకుండా జనసంచారంలోకి వస్తే వాటిపై దాడి చేయకుండా వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందిస్తే వాటిని పట్టుకొని అడవుల్లో వదిలేస్తామని తెలిపారు.

రోజుకో కార్యక్రమం..

ఈ నెల 9వరకు రోజుకో కార్యక్రమాన్ని నిర్వహించడానికి అటవీ శాఖ ప్రణాళిక రూపొందించింది. 4న పక్షుల వీక్షణ, 5న అడవుల్లో నడక, ట్రెక్కింగ్, 6న విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, పెయింటింగ్, 7న పాఠశాల, కళాశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన, 8న ప్రతీ రేంజ్ పరిధిలో బైక్‌ర్యాలీ, 3కె రన్, 9న అడవుల్లో ఫీల్డ్ విజిట్, ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

జిల్లాలో వన్యప్రాణుల వివరాలు

చిరుతలు	21	నెమళ్లు	315
ఎలుగుబంట్లు	29	నక్కలు	11
అడవి కుక్కలు	32	తోడేళ్లు	5
అడవి పిల్లులు	25	హైనాలు	3
జింకలు	295		

రైతులను రోడ్లపైకి తెచ్చారు

- మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్
- రైతులతో కలిసి రోడ్డుపై రాస్తారోకో



ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

లింగంపేట(ఎల్లారెడ్డి) : కాంగ్రెస్ పార్టీ తమ పాలనలో రైతులను రోడ్లపైకి తెచ్చిందని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ విమర్శించారు. గురువారం లింగంపేట మండల కేంద్రంలో రెండు లక్షల రైతు రుణమాఫీ చేయాలని డిమాండు చేస్తూ స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా, రాస్తారోకో చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారం కోసం ఆచరణ సాధ్యంకాని హామీలిచ్చి అమలు చేయకుండా రైతులను, ప్రజలను మోసం చేస్తున్నారన్నారు.

లింగంపేట మండలంలోని మూడు సొసైటీల్లో 3,000 మంది రుణాలు తీసుకుంటే కేవలం 1300 మందికి మాత్రమే రుణమాఫీ చేశారన్నారు. రూ. 20 కోట్లకు కేవలం రూ.5 కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బీమా రూ. 22 కోట్లు అందజేసిందన్నారు. గంట పాటు రాస్తారోకో, ధర్నా చేశారు. అనంతరం సీఎం దిష్టిబొమ్మ దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రమేశ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ సంపత్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు తదితరులున్నారు.

నేటి నుంచి రోడ్లపైకి ఎలక్ట్రిక్ బస్సులు

- నిజామాబాద్‌కు చేరుకున్న 13 బస్సులు
- చార్జింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- ప్రారంభించనున్న రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ఖలీల్‌వాడి: డీజిల్ భారాన్ని తగ్గించుకోవడంతోపాటు కాలుష్య రహిత సేవలు అందించడమే లక్ష్యంగా ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సులను తీసుకువచ్చింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు 64 బస్సులు రావాల్సి ఉండగా మొదటి దఫాలో నిజామాబాద్–2 డిపోనకు 13 బస్సులు చేరాయి. ఎలక్ట్రిక్ బస్సులు రావడంతో చార్జింగ్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బస్సులను శుక్రవారం ప్రారంభించనున్నారు. నేటి నుంచి ఆధునిక వసతులు కలిగిన ఎలక్ట్రికల్ బస్సులు రోడ్లపైకెక్కనున్నాయి.

ప్రత్యేకతలు..

42 సీట్ల(డ్రైవర్ సీటుతో సహా) సామర్థ్యం ఉన్న ఈ బస్సుల్లో నాలుగు సీసీ కెమెరాలున్నాయి. ప్రత్యేకమైన వాకీటాకీల ద్వారా డ్రైవర్ ప్రయాణికులతో సమన్వయం చేసుకోవచ్చు. పూర్తిగా సెన్సార్ సిస్టంతో బస్సులు నడుస్తాయి. బస్సుకు మూడు వైపులా ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఎలక్ట్రిక్ సిస్టం బోర్డుల్లో స్టేజీల వివరాలు ఎప్పటికప్పుడు డిస్‌ప్లే అవుతాయి. ప్రతి సీటు వద్ద అలారం, మొబైల్ చార్జింగ్ సౌకర్యం ఉంటుంది.

ఇందూరు నుంచి జేబీఎస్‌కు..

ఎలక్ట్రిక్ బస్సులు నిజామాబాద్ – జేబీఎస్ మధ్య నడుపుతాం. విడలవారీగా వచ్చే బస్సులను కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ వంటి ప్రాంతాలకు నడుపుతాం. నిజామాబాద్ నుంచి జేబీఎస్‌కు పెద్దలకు రూ.360, పిల్లలకు రూ.230 టిక్కెట్ ఉంటుంది.

– జానీరెడ్డి, ఆర్ఎం, నిజామాబాద్

ప్రారంభమైన ఓపెన్ స్కూల్ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని ఓపెన్ ఇంటర్, పదో తరగతి పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. పదో తరగతిలో తెలుగు పరీక్షకు 52 మందికి 41 మంది హాజరు కాగా 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల్లో తెలుగు పరీక్షకు 81 మందికి 57 మంది హాజరు కాగా 24 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షల్లో ఇంటర్‌లో అరబిక్ సబ్జెక్టు పరీక్ష నిర్వహించారు.

గేటు వద్ద నిలిచిన గూడ్స్

డిచ్‌పల్లి: డిచ్‌పల్లిలో రైలు గేటు మధ్యలో గురువారం రాత్రి గూడ్స్ రైలు పది నిమిషాల సేపు సాంకేతిక కారణాల వల్ల నిలిచింది. అయితే గూడ్స్ రైలు వస్తుందని సిబ్బంది 10 నిమిషాల ముందు రైల్వేగేటు వేశారు. దీనికి తోడు సాంకేతిక కారణాలతో రైలు నిలిచిపోవడంతో 30 నిముషాల పాటు గేటు మూసి ఉంచడంతో ఇరువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇలా గేటు మధ్యలో గతంలో ఒకసారి గూడ్స్ రైలు నిలిచిందని స్థానికులు తెలిపారు.

నేడు తెయూ సెర్చ్ కమిటీ సమావేశం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ నియామకం కోసం శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు రాష్ట్ర సచివాలయంలో సమావేశం జరుగనుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. సీఎస్ శాంతి కుమారి నేతృత్వంలో జరిగే ఈ సమావేశంలో సెర్చ్ కమిటీ సభ్యులైన యూజీసీ నామినీ, హిమాచల్‌ప్రదేశ్ లోని వైఎస్ పార్మర్ హార్టికల్చరల్ యూనివర్సిటీ ఉప కులపతి రాజేశ్వర్ సింగ్ చందేల్, యూనివర్సిటీ ఈసీ నామినీగా ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు సులేమాన్ సిద్ధికి పాల్గొననున్నారు. ఈసారి వీసీల నియామకాల్లో అర్హతలు, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకునేందుకు గాను ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉండడంతో కొందరి ఆశలు సన్నగిల్లినట్లు తెలుస్తోంది.

- వీసీల నియామకం విషయంలో కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా జాప్యం జరుగుతోంది. ఈ నెల 4న జరగాల్సిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ సెర్చ్ కమిటీ సమావేశం ఈ నెల 9న జరుగనుంది. దీంతో రాష్ట్రంలో అన్ని వర్సిటీల వీసీల నియామక ఉత్తర్వులు ఈ నెల 12న ఇవ్వనున్నట్లు సమాచారం.
- తెలంగాణ వర్సిటీ నుంచి ఇద్దరు విశ్రాంత ఆచార్యులు, మరో ఐదుగురు ప్రస్తుతం పనిచేస్తున్న వారు దరఖాస్తు చేసుకున్నారు. మాజీ వీసీ రవీందర్ గుప్తా హయాంలో అధికారంలో ఉండి విచ్చలవిడిగా అవినీతి అక్రమాలకు పాల్పడిన ఇద్దరు ఆచార్యులపై (వీరిలో ఒకరు మహిళ) విజిలెన్స్ కేసులు ఉండటంతో వారి పేర్లు పరిగణనలోకి తీసుకోలేదని తెలుస్తోంది. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు సదరు ప్రొఫెసర్ జిల్లాకు చెందిన ఒక మధ్యవర్తి ద్వారా స్థానిక ఎమ్మెల్యే నుంచి అదే సామాజిక వర్గానికి చెందిన మంత్రి వరకు వెళ్లినట్లు తెలిసింది. ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యేను కలిసి తనకు వీసీ పదవి దక్కేలా చూడాలని కోరినట్లు తెలిసింది. కాగా తెయూ నుంచి దరఖాస్తులు చేసుకున్న వారిలో కామర్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్‌కు అవకాశం ఉన్నప్పటికీ ఇటీవల ఆయన తీసుకున్న కొన్ని నిర్ణయాలపై ఇంటెలిజెన్స్ నిఘా పెట్టడంతో ఫలితం ఎలా ఉంటుందో చూడాలి.

స్వచ్ఛత జీవన విధానం కావాలి

- రైల్వే ఏడీఎఫ్ఎం సాల్వన్ సంగ



ప్లాట్ ఫాంను శుభ్రం చేస్తున్న అధికారులు

ఖలీల్‌వాడి: స్వచ్ఛత ప్రతి ఒక్కరి జీవన విధానం కావాలని హైదరాబాద్ రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్ సాల్వన్ సంగ తెలిపారు. గురువారం నిజామాబాద్ జంక్షన్ రైల్వే స్టేషన్‌లో గురువారం 'స్వచ్ఛతా హీ సేవ'లో భాగంగా రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్, రైల్వే ట్రాక్, పలు ప్రదేశాల్లో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'స్వచ్ఛతా హీ సేవ'ను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఒక్కరోజు కార్యక్రమంలా కాకుండా నిరంతరం కొనసాగించాలన్నారు. అపరిశుభ్ర పరిసరాల నుంచి పరిశుభ్రత దిశగా, అనారోగ్యం నుంచి ఆరోగ్య దిశగా, కాలుష్యం నుంచి స్వచ్ఛత దిశగా దేశాన్ని ముందుకు నడిపించే మహత్తర కార్యక్రమం స్వచ్ఛతా హీ సేవ అని అన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి ధర్మానాయక్, నిజామాబాద్ రైల్వే స్టేషన్ మేనేజర్ సదాశివుడు, హెల్త్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ సాగర్, నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్, అసిస్టెంట్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్ దీప, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఉదయ్, నిజామాబాద్ జంక్షన్ రైల్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే షురూ



సాంపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే ప్రారంభమైంది. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో గురువారం జిల్లా యంత్రాంగం సర్వేను చేపట్టింది. ఆర్మూర్ పట్టణంలోని రెండో వార్డు, అదే నియోజకవర్గంలోని రాంపూర్, బాల్కొండ నియోజకవర్గం పరిధిలోని శ్రీరాంపూర్, భీమ్‌గల్ పట్టణంలోని ఏడో వార్డు, బోధన్ నియోజకవర్గంలోని లంగ్డాపూర్, బోధన్ పట్టణంలోని 25వ వార్డు, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 45, 38, 3 డివిజన్‌లలో, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని సాంపల్లిలో సర్వే నిర్వహించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సాంపల్లి, ఆర్మూర్ పట్టణంలో సర్వేను పర్యవేక్షించారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. మిగతా ప్రాంతాల్లో ఆర్డీవోలు, నిజామాబాద్‌నగరంలో మున్సిపల్ కమిషనర్ మకరందు సర్వేను పర్యవేక్షించారు. నిజామాబాద్ నగరంలో సర్వే కోసం అదనంగా అదనంగా సిబ్బందిని కేటాయించారు. ఈ నెల ఏడో తేదీలోగా సర్వే పూర్తి చేయాలని ఆదేశాలు జారీ కావడంతో పకడ్బందీగా చేపడుతున్నారు.

నైపుణ్యాభివృద్ధికే డ్యూటీ మీట్



బాసర జోన్ డ్యూటీ మీట్‌లో పాల్గొన్న అధికారులు

ఖలీల్‌వాడి: పోలీసుల పనితీరుని మెరుగుపర్చేందులు పోలీస్ డ్యూటీ మీట్‌లు ఎంతో దోహదపడతాయని సీపీ కల్మేశ్వర్ అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ గ్రౌండ్, పోలీస్ కమాండ్ కంట్రోల్ కార్యాలయం, పోలీస్ కార్యాలయంలో సీఐలు, ఎస్సైలు, సిబ్బందికి బాసర జోన్ డ్యూటీ మీట్ నిర్వహించారు. నిజామాబాద్, జగిత్యాల్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన పోలీసులకు నేర పరిశోధన, డాగ్ స్క్వాడ్ పనితనం, ఫింగర్ ప్రింట్ పరిశోధన, బాంబ్ డిస్పోజల్ టీం విధులు, కంప్యూటర్‌పై నైపుణ్యం, అవాంఛనీయ ఘటనల్లో వీడియోగ్రఫీ చేయు విధానం, సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్, పలు అంశాల్లో రాత పరీక్ష చేపట్టారు. మంచి ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయిలో నిర్వహించే డ్యూటీ మీట్ కార్యక్రమానికి పంపనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలు రెండు రోజుల పాటు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీసీపీ (అడ్మిన్)కోటేశ్వర రావు, అదనపు డీసీపీ (ఏఆర్) శంకర్ నాయక్, సీసీఎస్, ఏసీపీ నాగేంద్ర చారి, సీసీఆర్‌బీ ఏసీపీ రవీందర్ రెడ్డి, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ నాగమోహన్, సీసీఎస్ వీ సురేష్, సీటీసీసీఐ శివరాం, సైబర్ క్రైమ్ సీఐ ముఖీద్ పాషా, జగిత్యాల్, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

5లోగా సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రావాలి

నిజామాబాద్ అర్బన్: డీఎస్సీ ఫలితాల్లో 1:3 పద్ధతిలో ఎంపికైన అభ్యర్థులు తప్పనిసరిగా శనివారం సాయంత్రంలోగా ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని డీఈవో దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. నగరంలోని నిర్మల హృదయ పాఠశాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కొనసాగుతోందని, 5వ తేదీ తరువాత వచ్చే వారిని పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని స్పష్టం చేశారు.

500 మంది సర్టిఫికెట్లు..

అధికారులు గురువారం 500 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను వెరిఫై చేశారు. 1:3 పద్ధతిలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరిశీలన కొనసాగింది.

క్రైం కార్నర్

భార్య ఫోన్ మాట్లాడలేదని ఆత్మహత్య



భిక్కనూరు: కట్టుకున్న భార్య, కన్న కుమార్తె మాట్లాడడం లేదని ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన భిక్కనూరు మండల కేంద్రంలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గంధం కేశ్వయ్య(40), రూప భార్యాభర్తలు. వీరికి నితీష అనే కుమార్తె ఉన్నారు. ఇటీవల నితీష పెళ్లి విషయంలో దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో రూప కుమార్తె నితీషను తీసుకొని తన తల్లిగారింటికి వెళ్లింది. నాటి నుంచి కేశయ్య భార్య, కుమార్తెతో మాట్లాడాలని ఫోన్ చేస్తే వారు మాట్లాడడం లేదు. కనీసం తిరిగి ఫోన్ కూడా చేయకపోవడంతో మనస్తాపానికి గురైన కేశయ్య తాను నివసించే రేకుల షెడ్డులోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం గుర్తించిన గ్రామస్తులు మృతుడి భార్యకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



పిట్లం: మండల కేంద్రానికి చెందిన పత్తి బాలవ్వ నివాసపు ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో గురువారం దగ్ధమైంది. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న వస్తువులు, ఫ్రిడ్జ్, కూలర్, టీవీ, దుస్తులు, బియ్యం అగ్నికి ఆహుతైనట్లు బాధితురాలు తెలిపారు. ఇల్లు కాలిపోవడంతో తన కుటుంబం వీధిన పడిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరారు.

దేవునిపల్లిలో గుడిసె..



కామారెడ్డి రూరల్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి హోలియా దాసరి కాలనీలో నాటక కళాకారుడు పెండ్యాల సాయిలుకు చెందిన నివాసపు గుడిసె గురువారం దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు తన ఇంటికి నిప్పు పెట్టడంతోనే ఈ ఘటన చోటు చేసుకుందని బాధితుడు తెలిపారు. ఈ ఘటనతో ఇంట్లో వస్తువులు, బైక్ కాలిపోయిందన్నారు. రూ. 50వేల ఆస్తి నష్టం జరిగిందని ఆయన పేర్కొన్నారు. బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యుడు రాజుపాటిల్ బాధితుడిని పరామర్శించి ఆర్థికసాయం అందించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు సందర్శించి ఘటనపై విచారణ చేపట్టారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి



జైల్‌సింగ్ (ఫైల్)

మాచారెడ్డి : రోడ్డుపై నిల్చున్న ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్‌ను మాచారెడ్డి మండల కేంద్రంలో టిప్పర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాల పాలైన ఆయన చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారి మండలం యాచారం గ్రామానికి చెందిన జైల్‌సింగ్(33)ఏడాది నుంచి మాచారెడ్డిలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లిన జైల్‌సింగ్ విధి నిర్వహణలో భాగంగా భవానీపేట గ్రామానికి వెళ్లి మాచారెడ్డి వైపు వస్తున్నాడు. భవానీపేట మూల మలుపు వద్ద బైక్ ఆపి మూత్ర విసర్జన చేస్తుండగా మొరం టిప్పర్ ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ జైల్‌సింగ్‌ను చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, మూడేళ్ల కుమార్తె ఉన్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొని..



ప్రసాద్ మృతదేహం

మాక్లూర్: రోడ్డుపై ఆగిఉన్న లారీని ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన మాక్లూర్ మండలంలోని అడవి మామిడిపల్లి శివారులో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుత్ప గ్రామానికి చెందిన కల్లెడి ప్రసాద్(36) జిల్లా కేంద్రంలోని ద్వారకా మై టిఫిన్ సెంటర్‌లో వంట మనిషిగా పనిచేస్తున్నాడు. పని ముగించుకొని స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా అడవి మామిడిపల్లి శివారులోని జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతనికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తమ్ముడు కల్లెడి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ఆంజనేయులు

గాంధారి: మండల కేంద్రంలోని వాగులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై ఆంజనేయులు గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. వాగులో మృతదేహం ఉన్నట్లు స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి వయస్సు సుమారు 45 ఏళ్ల వరకు ఉంటుందని, మృతదేహం నెక్కరు, తెల్లని టీషర్టు ఉందన్నారు. మృతుడి చేతిపై పచ్చబొట్టుతో తమిళంలో ఓ పేరు రాసి ఉందని దానిని తెలుగులోకి అనువాదించగా వాసుమీగా తేలిందన్నారు. మూడు రోజుల క్రితం వాగులో పడి మృతి చెందడంతో మృతుడి ముఖం, చేతులను చేపలు కొద్దిభాగం తిన్నట్లు పేర్కొన్నారు. ఘటన స్థలానికి కొద్ది దూరంలో చెప్పుల జత, గొడుగు, మందు సీసా ఉందన్నారు. చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెంది ఉంటాడన్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఎవరికైనా మృతుడి ఆచూకీ తెలిస్తే 8712686165 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

ప్రేమ జంటకు వేధింపులు

నవీపేట: నవీపేట శివారులో బుధవారం రాత్రి ప్రేమ జంటను వేధించిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. జగిత్యాల జిల్లా రాయికల్‌కు చెందిన ప్రేమ జంట బైక్‌పై బుధవారం రాత్రి బాసర వైపు బయలు దేరారు. మార్గమధ్యలో నవీపేట శివారులో రహదారి పక్కన ఆగారు. అదే సమయంలో నవీపేటకు చెందిన ఇద్దరు యువకులు ప్రేమజంటను నిలదీశారు. ఫొటోలు తీస్తున్నట్లు భయపెట్టారు. బ్లాక్‌మెయిల్ చేసేందుకు యత్నించారు. దీంతో ప్రేమ జంట గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నవీపేటకు చెందిన ఇద్దరి ఆకతాయిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ప్రజలను ఎవరినైనా ఇబ్బందులకు గురిచేస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

దుకాణం గోడ కూలి ఒకరికి గాయాలు



బాన్సువాడ: పట్టణంలోని తాడ్కోల్ రోడ్డులో ఉన్న ఓ దుకాణం గోడ కూలి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ వ్యక్తి తన బైక్‌ను రిపేరులో భాగంగా మోటర్ వైండింగ్ దుకాణానికి తీసుకొచ్చాడు. దుకాణం బయట నిల్చున్న సదరు వ్యక్తిపై దుకాణం వెల్‌వేషన్ గోడ కూలింది. ఈ ఘటనలో అతనికి తీవ్రగాయాలు కావడంతో పాటు అతని బైక్ ధ్వంసమైంది. దీంతో దుకాణ యజమాని గాయాలైన వ్యక్తిని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాడు.